# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు లోక్ మంథన్ కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.**
2. **శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈరోజుతో ముగియనున్నాయి.**
3. **ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రంలో 4 వేల 500 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ వెల్లడించారు.**
4. **ఆంధ్రప్రదేశ్ శాసన సభ కమిటీల్లో సభ్యుల ఎన్నికకు సంబంధించిన పోలింగ్ కొనసాగుతోంది.**
5. **తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి సంబంధించిన ఆర్జితసేవా టికెట్ల ఫిబ్రవరి నెల కోటాను టిటిడి రేపు విడుదల చేయనుంది.**

===========================

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు లోక్ మంథన్ కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శిల్పారామంలో 4వ లోక్ మంథన్ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము మాట్లాడుతూ, దక్షిణాది రాష్ట్రాల్లో తొలిసారిగా అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవం జరుగుతోందని అన్నారు. దేశ సంస్కృతి, ఆచారాలను నిరంతరం పటిష్టం చేయాల్సిన అవసరముందని వాటికి లోక్ మంథన్ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని రాష్ట్రపతి పేర్కొంటూ,

వాయిస్ ( 30 సెకన్లు )

---------------------------

శాసనసభ సమావేశాలు పదవ రోజు కొనసాగుతున్నాయి. ప్రశ్నోత్తరాల సమయం కొనసాగుతోంది. శాసన సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిస్తున్నారు. శాసనసభలో ఈ రోజు 'రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి చేపడుతున్న చర్యలు' అనే అంశంపై సభలో చర్చ జరగనుంది. అనంతరం 2047-విజన్ డాక్యుమెంట్‌పై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటన చేయనున్నారు. అలాగే వరదలు, రుషికొండ నిర్మాణాలు వంటి అంశాలపై చర్చించనున్నారు.

ఇది ఇలా ఉండగా ఈనెల 11న ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ రోజుతో

ముగియనున్నాయి.

---------------------------

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రంలో 4 వేల 500 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా ఉపాధి హామీ పథకం అమలుపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఉపముఖ్యమంత్రి సమాధానమిస్తూ, సంక్రాంతిలోపు పనులు పూర్తి చేస్తామని, సాగు పనులను ఉపాధి హామీకి అనుసంధానం చేయడంపై పరిశీలిస్తామన్నారు. ఉపాధి హామీ కింద కాలువల్లో పూడిక, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపడుతున్నామని తెలియజేస్తూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

పోలీసులు పని ఒత్తిడిని అధిగమించడానికి క్రీడా పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న 78వ పోలీసు క్రీడా పోటీలను ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్ శివ కిషోర్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ క్రీడలను దినచర్యలో భాగం చేసుకుని ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పొందాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతకు క్రీడా పోటీలు నిర్వహించి, ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను తీసుకొస్తున్నామని ఎస్పీ వివరించారు.

---------------------------

సంచార జాతుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో మంత్రి సవితను కలిసి రాష్ట్ర సంచార జాతుల అభివృద్ధి మండలి సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, సంచార జాతుల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని,. కేంద్ర ప్రభుత్వ సాయంతో వారికి ఉపాధి, నివాస భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 'సీడ్' పథకం ద్వారా సంచార జాతులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా శిక్షణ ఇవ్వడంతో పాటు రుణాలు అందిస్తామని వారికి ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు కూడా అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

తిరుమలలో వసతి గదులకు సంబందించిన నగదు డిపాజిట్ పై సమాచారాన్ని వాట్సప్ ద్వారా భక్తులకు తెలపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా గదులకు కాషన్ డిపాజిట్ పై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ,

వాయిస్ ( 30 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసన సభ కమిటీల్లో సభ్యుల ఎన్నికకు సంబంధించిన పోలింగ్ ఈ రోజు కొనసాగుతోంది. ప్రజాపద్దులు కమిటీ–పీఏసీ, ప్రభుత్వరంగ సంస్థల కమిటీ–పీయూసీల్లో సభ్యుల నియామకం కోసం ఎన్నిక

జరుగుతోంది. వెలగపూడి శాసనసభలోని కమిటీ హాల్లో ఈ ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనుంది. శాసన సభ్యులు ఒక్కొక్కరుగా ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. శాసనసభ ఆర్థిక కమిటీలకు ముగ్గురు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు నామినేషన్లు దాఖలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం పోలింగ్‌ని చేపట్టింది.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి సంబంధించిన ఆర్జితసేవా టికెట్ల ఫిబ్రవరి నెల అంగ ప్రదక్షిణం టోకెన్ల కోటాను రేపు ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం – టిటిడి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే శ్రీవాణి ట్రస్టు టికెట్లను రేపు ఉదయం 11 గంటలకు విడుదల చేయనుంది. వయోవృద్ధులు, దివ్యాంగులకు సంబంధించి ఫిబ్రవరి నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను రేపు మధ్యాహ్నం 3 గంటలకు, ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 25న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో ఫిబ్రవరి నెల గదుల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టిటిడి పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక, సంస్కృతి సమితి చైర్ పర్సన్‌గా పి. తేజస్వి ఈరోజు విజయవాడలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, కళలకు, సంస్కృతి, సంప్రదాయాలకు రాష్ట్రం నిలయమని సాంస్కృతిక పునరుజ్జీవం దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జానపద కళలకు, రాష్ట్రానికి సాంస్కృతిక పునర్ వైభవం తెచ్చేందుకు కృషి చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

దక్షిణ అండమాన్ సమీపంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. రెండు రోజుల్లో అది వాయుగుండంగా బలపడుతుందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో 25, 26 తేదీల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో అతి భారీ వర్షాలు, రాయలసీమలో భారీ వర్షాలు కురవొచ్చని తెలిపింది. ఈ అల్పపీడనం తుపానుగా బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తర్వాత తీవ్ర వాయుగుండంగా బలహీనపడి, 27 నాటికి తమిళనాడు లేదా ఆంధ్రప్రదేశ్‌లో తీరం దాటుతుందని అంచనా వేస్తున్నామన్నారు.

=====================